క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. బీచ్‌కు వెళ్లే వారితో పాటు అయ్యప్ప, భవానీ మాలధారులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ, చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా గణపతి హోమం


గగ్గిపర్రులో గణపతి హోమం చేస్తున్న అయ్యప్ప మాలధారులు

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం పంచాయతీ గగ్గిపర్రు గ్రామంలోని పెద రామాలయంలో గురుస్వామి జొన్నల వాసు ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు ఆదివారం గణపతి హోమం నిర్వహించారు. గురుస్వామి జొన్నల వాసు పాటు 18 మంది మాలధారులతో అర్చకులు ఏడిద నరసింహాచార్యులు, ప్రసాదాచార్యులు, శ్రీనివాసుల సాయి భగవానాచార్యులు శాస్త్రోక్తంగా హోమం చేయించారు. అయ్యప్ప మాలధారులతో పాటు వారి కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి హోమంలో ద్రవ్యాలు వేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెనుమంట్రలో ఉచిత ధ్యాన శిక్షణ


ధ్యాన శిక్షణ ఇస్తున్న గీతాలక్ష్మి

పెనుమంట్ర: పెనుమంట్రలో భూపతిరాజు శ్రీనివాసరాజు, సాయి గీతా దంపతులు నిర్మించిన బ్రహ్మర్షి పితామహ ధ్యాన మందిరంలో ఆదివారం మండపేటకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ గీతాలక్ష్మి పాల్గొని జ్ఞానబోధ చేసి, ధ్యాన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గీతాలక్ష్మి మాట్లాడుతూ భగవద్గీత అంటే జీవనగీత అని తెలిపారు. పత్రీజీ ప్రబోధించిన శ్వాసమీద ధ్యాస ఉంచి ధ్యాన సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో సుబ్బరాజు, మధు, సత్యవతి, తులసమ్మ, రమ, మంతెన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘ ప్రధాన కార్యదర్శిగా సుధాకర్


నియామక పత్రం అందుకుంటున్న కూనపరెడ్డి

పెనుగొండ: జాతీయ కాపు సంఘం ఆచంట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా పెనుగొండకు చెందిన కూనపరెడ్డి సుధాకర్‌ను జాతీయ అధ్యక్షుడు కర్ణ మురళీ కృష్ణ నాయుడు నియమించి, నియామక పత్రం అందించారు. ఈ మేరకు సుధాకర్ ఆదివారం పెనుగొండలో విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం విజయవాడలో నియామక పత్రం అందుకున్నట్లు తెలిపారు. కాపు కులంలో వెనుకబడినవారి అభ్యున్నతికి కృషి చేయడానికి అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తానని తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సుధాకర్‌ను పలువురు అభినందించారు.

సిద్ధాంతంలో ఎక్సైజ్ దాడులు


సిద్ధాంతంలో పట్టుబడ్డ మద్యం బాటిళ్లు, నిర్వాహకుడితో ఎక్సైజ్ పోలీసులు

పెనుగొండ: తణుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సిద్ధాంతంలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో మామిడిశెట్టి త్రిమూర్తులు బెల్ట్ షాపు నిర్వహిస్తూ పట్టుబడ్డాడని సీఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి ఐదు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడుల్లో ఎస్సై బి.లక్ష్మీ, ఆర్.మధుబాబు పాల్గొన్నారు.

ఆచంటలో

ఆచంటలో పాలకొల్లు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో మానుకొండ కుమారిని అరెస్ట్ చేసి, ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. దాడుల్లో ఎస్సైలు పి.మహేష్, జి.రఘు తదితరులు పాల్గొన్నారు.

అయ్యభౌబోయ్

- గ్రామాల్లో భయపెడుతున్న గ్రామ సింహాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

పెనుగొండ: రాత్రయితే చాలు గ్రామాల్లోని కూడళ్ల గ్రామ సింహాలతో నిండిపోతున్నాయి. అడ్డూ అదుపు లేకుండా కుక్కల సంఖ్య పెరిగి దాడి చేస్తుంటే ప్రజలు హడలిపోతున్నారు. రాత్రి సమయాల్లో వాహనాలను వెంటాడి వెంటాడి మరీ వాహనదారులను గాయపరుస్తున్నాయి. పగటి వేళ ఆయా వీధిల్లో ఆటాలడుకునే చిన్నారులు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులను కరుస్తూ హడలెత్తిస్తున్నాయి.వీటిని నియంత్రించేందుకు చట్టాలు అడ్డువస్తుండడంతో అధికారులు ఈ విషయాన్ని గాలికొదిలేశారు. దీంతో ప్రతి వీధికి 10 నుంచి 15 వరకూ కుక్కలు పెరిగిపోవడంతో చిన్నారులను బయటకు పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. రాత్రి వేళల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. మోటారుసైకిల్లు వచ్చేవారిని వెంటాడి వెంటాడి మరీ గాయపరుస్తున్నాయి. దీంతో కుక్క కాటు నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తూ ప్రమాదాలకు గురవుతూ తీవ్ర గాయాల పాలై ఆసుపత్రులు పాలవుతున్నారు. దీంతో కుక్క కాటు కేసులు భారీగా నమోదవుతున్నాయి.


పెనుగొండలో చర్మ వ్యాధులతో ఉన్న కుక్కలు


సిద్ధాంతంలో కుక్కల స్వైర విహారం చేస్తున్న దృశ్యం

భారీగీ పెరుగుతున్న కుక్క కాటు కేసులు

ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ, సిద్ధాంతం, ఆచంట, వల్లూరు, ఆచంట వేమవరం, మార్టేరు, భట్లమగుటూరు, పోడూరుల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలోనూ ప్రతి నెలా ఒక్కో చోట 50 నుంచి 100 కు పైగా వ్యాక్సిన్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇవి గుంపులు, గుంపులుగా తిరుగుతండడంతో వీటిని అదుపు చేయడం ఎవరీ వల్లా కావడం లేదు. కుక్కలను పట్టుకోవడానికి చట్టాలు అడ్డువస్తుంటే కనీసం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి వాటిని సంతతిని నిరోధించడం ద్వారా సంఖ్యను తగ్గించాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల కాలంలో కుక్కలకు చర్మ వ్యాధులు అధికంగా వస్తుండడంతో వాటిని చూసే సరికి భయమేస్తుందంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పెనుగొండ, సిద్ధాంతం వంటి గ్రామాల్లో చర్మ వ్యాధులు సోకిన కుక్కలు అధికంగా ఉన్నాయి. వీటికి వైరస్ సోకడం వల్ల పూర్తిగా చర్మ వ్యాధులు సోకి, వాటి సమీపంలోకి వెళితే చాలు లేనిపోని జబ్బులు వచ్చే అవకాశం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నుంచి ప్రజలను రక్షించాలని కోరుతున్నారు.

వెంటాడుతున్నాయి



మోటారు సైకిల్‌పై సాయంత్రం ఆరు దాటిన తరువాత వెళితే చాలు వెంటాడి మరీ కరుస్తున్నాయి. దీంతో భయపడిపోవాల్సి వస్తుంది. వాటిని తప్పించుకొనే ప్రయత్నంలో ప్రమాదం భారీన పడి గాయపడుతున్నారు.

– ఎం.బాల్జీ, చెరుకువాడ

చర్మ వ్యాధులతో భయం



కుక్కలకు చర్మవ్యాధులు అధికంగా వస్తుండడంతో భయపడాల్సి వస్తుంది. పెనుగొండలో వీటి సంఖ్య ఎక్కువగా ఉంది. మరీ ఎక్కువగా ఉన్నవాటి నుంచి దుర్వాసనలు వస్తున్నాయి. దగ్గరగా వెళ్లాలంటేనే భయంగా ఉంది.

– కె.తాతారావు, పెనుగొండ

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలి



కుక్కల సంతతి తగ్గించడానికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తే గ్రామాల్లో వీటి సంఖ్య తగ్గుతుంది. కుక్కలను పట్టుకున్నా గ్రామ శివారున తిరిగి వదిలేస్తుండడంతో పక్క గ్రామంలోని కుక్కలు ఇతర గ్రామాల్లోకి చేరుతున్నాయి.

– జి.ప్రసాద్, పెనుగొండ

చదరంగంతో ఏకాగ్రత పెరుగుదల


బాలుడితో కలిసి చెస్ ఆడుతున్న ఆర్‌డీఓ దాసి రాజు

పాలకొల్లు సెంట్రల్: చదరంగం వల్ల పిల్లల్లో మేధాశక్తి, ఏకాగ్రత పెరుగుతుందని నరసాపురం ఆర్‌డీఓ దాసి రాజు అన్నారు. ఆదివారం స్థానిక యూరో కిడ్స్ స్కూల్లో జిల్లా స్థాయి ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చదరంగం పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ ఏ వయస్సు వారైనా, ఏ సమయంలోనైనా, ఏ ప్రదేశంలోనైనా ఆడుకునే క్రీడ చదరంగమని అన్నారు. కొన్ని క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తే చెస్ మాత్రం మేధస్సును పెంచుతాయన్నారు. ఈ సందర్భంగా బాలుడితో కలిసి ఆడుతూ చెస్ పోటీలను ప్రారంభించారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మాదాసు కిషోర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి 100 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ పోటీలకు ఆతిథ్యమిచ్చిన యూరో కిడ్స్ స్కూల్ అధినేత మద్దుల రాజేష్ గుప్తకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా పి.రవిప్రసాద్, సురేష్, రాణి తదితరులు వ్యవహరించారు.

ఉత్సాహంగా కార్తీక వనసమారాధనలు


మొగల్తూరు: గౌడ, శెట్టిబలిజల కార్తీక వనసమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్


పెనుగొండ: చెరుకువాడలో కాపుల వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

మొగల్తూరు: మండలంలోని నవుదూరుగరువు సంఘం ఆధ్వర్యంలో మండల గౌడ, శెట్టిబలిజల 30వ వార్షికోత్సవ కార్తీకవన సమారాధనను ఆదివారం మొగల్తూరులో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన గౌడ, శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన వారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, నరసాపురం జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, గుబ్బల రాధాకృష్ణ, మండల నాయకులు మామిడిశెట్టి సత్యనారాయణ, గుబ్బల నాగరాజు, పాలా రాంబాబు, శీలబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే గాయత్రి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనను ఆదివారం మొగల్తూరులో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బ్రాహ్మణులంతా శిష్టా సత్యనారాయణ సోదరుల ఇంటి ఆవరణలో నిర్వహించిన రమాసత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు.

మార్టేరులో..

పెనుమంట్ర: మార్టేరు ప్రధాన సెంటర్‌లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తానని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, అన్నారు. ఆదివారం మార్టేరు పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీకవన వనభోజన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా కూడా తనవంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన గ్రామ ఎంపీటీసీ సభ్యుడు , జిల్లారెడ్డి సేవా సంఘం కార్యదర్శి గుడిమెట్ల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ 24 ఏళ్లుగా అన్ని కులాలకు చెందిన నిరాశ్రయులకు అన్నదాత ఫౌండేషన్ పేరుతో ఒక పూట భోజనం పెడుతున్నామని, 2006లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేతులు మీదుగా ప్రారంభించిన కల్యాణ మండపం , భోజనశాల రెడ్డి సోదరుల దాతృత్వం దినదినాభివృద్ధి చెందుతూ వస్తుందని అన్నారు. ఈసందర్భంగా గతేడాది టెన్త్, ఇంటర్‌లలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆరుగురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, నగదు పురస్కారాలు అందజేశారు. మహిళలు, చిన్నారులకు క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు, లక్కీడ్రాలు నిర్వహించారు. దాతల సహకారంతో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పెనుగొండ వేమనరెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు మేడపాటి చిరంజీవిరెడ్డి, పంచగ్రామ రెడ్డి సేవా సంఘం అన్నదాన కమిటీ సభ్యుడు కేకేఆర్ చంద్రశేఖర్‌రెడ్డి, గుడిమెట్ల లక్ష్మారెడ్డి, నల్లమిల్లి వివేకానందరెడ్డి, కర్రి ఫణీంద్రరెడ్డి, కోనాల విజయ్‌కృష్ణారెడ్డి, పడాల జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.


పెనుమంట్ర: మార్టేరులో నిర్వహించిన కార్తీక వనసమారాధనకు హాజరైన రెడ్డి కులస్తులు


పాలకొల్లు సెంట్రల్: సాహితీవేత్త శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: కందుకూరి వీరేశలింగం ఆనాటి సమాజంలో ఉన్న పరిస్థితులను సంస్కరించాలని తలపెట్టి చేసిన సంస్కరణలు నేటికి మరువరానివని సాహితీవేత్త కానుకొలను శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రసధుని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి విద్యాపీఠం ఆవరణలో సాహితీ సభ, కార్తీక వనసమారాదన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో అజ్ఞానం, అంధకారం, మూడనమ్మకాలు ఎక్కువగా ఉన్న సమయంలో ఎంతో మంది చైతన్యవంతమైన వ్యక్తులు సమాజాన్ని సంస్కరించాలనుకున్నారు. నాటి ఆ ఆలోచనలతో పరిస్థుతలకు అనుగుణంగా ఎన్నో సంస్కరణలు చేపట్టారన్నారు. అలాంటి వారిలో కందుకూరి వీరేశలింగం ఒకరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొట్టి భాస్కరరావు, పి.లక్ష్మీనారాయణ, మద్దాల వాసు, దంగేటి గోపాలకృష్ణ, కోలాటి పెద్దిరాజు, చేగొండి రంగారావు, కొల్లి నరసింహమూర్తి, ఇనకొండ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: వనసమారాధనలు ఐక్యతను చాటి చెబుతాయని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం చెరుకువాడలో నిర్వహించిన కాపుల వన సమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కాపుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్య ద్వారా రాబోయే తరాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకి రామ్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఐ.రామానుజం, న్యాయవాది అనుకుల రమేష్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే పెనుగొండ మండలంలో వన సమారాధనలు జోరుగా సాగాయి. పెనుగొండ లక్ష్మీ జనార్దన స్వామి కల్యాణ మండపంలో ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పాల్గొని చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. పెనుగొండ మార్కెట్ యార్డులోనూ, సిద్ధాంతం కేదారీఘాట్ లోనూ పలు సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధనలు నిర్వహించారు.

స్టేషన్‌పేటలో ఇరిగేషన్ స్థలం ఆక్రమణ

ఆక్రమణ వెనుక జనసేన నాయకులు?

నరసాపురం: పట్టణంలోని 30వవార్డులో ఇరిగేషన్ శాఖకు చెందిన మురుగు కాలువగట్టు స్థలం ఆక్రమణకు గురైంది. కబ్జాదారులు గత 30 రోజుల నుంచి కాలువగట్టు వెంబడీ స్థలాన్ని బాగుచేయించుకుని స్తంభాలు పాతిమరీ తీరుబడిగా భూమిని ఆక్రమించుకుంటుంటే అధికారులు పట్టించుకోవడం లేదని అనేక విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం కాలువగట్టు వెంబడి సుమారు 50 సెంట్ల స్థలంలో స్తంభాలు వేసి, చుట్టూ గుడ్డలు కట్టారు. ఈ వ్యవహారం వెనుక వార్డుకు చెందిన కొందరు జనసేన నాయకుల ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కోట్లాది రూపాయలు విలువచేసే స్థలం కబ్జాకు గురవ్వడంపై స్థానికులు కొందరు కబ్జాదారులను ప్రశ్నించినా కూడా వారు దౌర్జన్యంగా సమాధానం చెప్పున్నారని వాపోతున్నారు. దీంతో వార్డు ప్రజలు ఈ విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లే యోచనలో ఉన్నారు. ఈ స్థలానికి ఎదురుగా ఉన్న స్థలం అంశంలో కూడా స్థానికులకు పట్టణంలోని ఓ ప్రముఖ వైద్యుడికి మధ్య చాలాకాలంగా వివాదం నడుస్తోంది. చివరకు ఈ వివాదం కోర్టుకు చేరింది. మళ్లీ ఇప్పుడు ఇదే వార్డులో మరో సమస్య తెర మీదకు వచ్చింది. దళితులు అత్యధికంగా ఉండే ఈ వార్డులో ఇటీవల కాలంలో భూముల కబ్జా ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది.


30వ వార్డులో ఆక్రమణకు గురైనట్టుగా చెబుతున్న ప్రాంతం

గోరింటాడలో వైద్య శిబిరం

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని గోరింటాడ గ్రామంలో యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం క్లబ్ అధ్యక్షులు జక్కంపూడి మదన్ మాట్లాడుతూ ఇలాంటి ఉచిత మెడికల్ క్యాంపులు వల్ల ప్రజలు ఎలాంటి ఖర్చులు లేకుండా తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవచ్చన్నారు. ఈ క్యాంపుల్లో మెరుగైన వైద్య సేవల కోసం క్లబ్ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు నారిన హర్ష, కార్తీక్, లక్ష్మీ ప్రసన్న, జక్కంపూడి సుభాషిణి, పెనుమాక భార్గవి శిబిరంలో తమ సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, ట్రెజరర్ శిరిగినీడి నాగార్జున, పోకల రాము, గంధం ఏసుపాదం, గుండుమోగుల వీరాస్వామి, సత్తినీడి రాజా తదితరులు పాల్గొన్నారు.


వైద్యశిబిరం వద్ద కాపు క్లబ్ సభ్యులు

పెనుగొండలో..

పెనుగొండ: వడలి మందాలమ్మ ఆలయ ప్రాంగణంలో పెనుగొండ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సీహెచ్ శిరీష డాక్టర్ ఎస్‌వీడీ పవన్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు.

గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు


బాధితుడిని 108 వాహనంలో తణుకు తరలిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: బ్రాహ్మణ చెరువు–పాలమూరు ఆర్‌అండ్‌బీ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ వ్యక్తి బ్రాహ్మణ చెరువు వైపు నుంచి పాలమూరు వైపు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో క్షతగాత్రుని జేబులో ఉన్న ఫోన్ పూర్తిగా దెబ్బతినడంతో ఆ వ్యక్తి ఎవరనేది తెలియరాలేదని పోలీసులు తెలిపారు. 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు మరమ్మతుల నిమిత్తం ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుకు అడ్డంగా కంకర గుట్టలు దింపి వదిలేయడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ రోడ్డులో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదుగురు వరకు ప్రమాదానికి గురయ్యారని పేర్కొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10:30 గంటలు నుంచి అందించాలని కోరారు.

పందులు, పశువులను రోడ్లపైకి వదలొద్దు

నరసాపురం: పట్టణంలో రోడ్లపై పశువులు, పందులు తిరుగుతున్నట్టుగా ఫిర్యాదులు వస్తున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ యజమానులు పందులు, పశువులను రోడ్లపైకి వదిలితే మున్సిపల్ ప్రజారోగ్య చట్టం ప్రకారం యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పందులు, పశువులను వేరే ప్రాంతాలకు తరలించడంతో పాటుగా భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పందులు, పశువులు రోడ్లపైకి రాకుండా కట్టడి చేసుకోవాలని కోరారు.

నరసాపురంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానం

నరసాపురం: స్వచ్ఛ మునిసిపాలిటీ... నరసాపురం మునిసిపాలిటీలో ప్రకటనలకే పరిమితమవుతోంది. సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణకు అధికారులు పూర్తిగా నీళ్లు వదిలారు. మునిసిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణలో ప్రస్తుతం ఉన్న లోపాలను అధిగమించడానికి అధికారులు చేపడుతున్న చర్యలు శూన్యమని పట్టణ వాసులు చెబుతున్నారు. ముఖ్యంగా వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. పట్టణంలో మొత్తం 48 వరకు మురికివాడలు ఉన్నాయి. మురికివాడల్లో పారిశుద్ధ్య నిర్వహణ మరింత అధ్వానంగా తయారైంది. దీనికి తోడు పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ సవ్యంగా లేకపోవడం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. పొన్నపల్లి, మాధవాయిపాలెం, స్టేషన్‌పేట, నందమూరి కాలనీ, 22వ వార్డు కొత్తకాలనీ, గ్రేస్ నగర్, వైఎస్సార్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. ఇక 29వ వార్డు అరుంధతీ పేటలో ఎక్కడ చూసినా చెత్తా, చెదారం దర్శనమిస్తుంది. దీంతో పట్టణ వాసులు రోగాల బారిన పడుతున్నారు. సాక్షాత్తు మార్కెట్ ప్రాంతంలో కూడా రోడ్లపై చెత్త దర్శనమిస్తుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

హడావుడికీ స్వచ్ఛ భారత్ పరిమితం

స్వచ్ఛ భారత్ అంటూ ఓవైపు హడావిడి చేస్తున్నారు. కానీ స్థానిక మునిసిపాలిటీలో చెత్త సేకరణలో లోపాలు మాత్రం సరిద్దిడంలేదు. చెత్త సేకరణ విషయంలో లోపాలను సరిదిద్దితే పారిశుద్ధ్యం అంశంలో చాలా సమస్యలకు మోక్షం కలుగుతుందని మునిసిపల్ అధికారులు ఎప్పటినుంచో అంగీకరిస్తూ వస్తున్నారు. దీనికి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడం ఒక్కటే మార్గమని అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం ఆ దిశగా అడుగులు పడడం లేదు. తడిచెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరిస్తామని, పారిశుద్ధ్య నిర్వహణలో కొత్త పంథాను తీసుకొస్తామని ఓ వైపు అధికారులు చెబుతున్నా అవన్నీ ఎప్పటికి కార్యరూపం దాలుస్తాయి? అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది.


బస్టాండ్ పక్కన 216 జాతీయ రహదారి పక్కన ఆదివారం దర్శమిస్తున్న చెత్తకుప్పలు


పట్టణంలో గడ్డిబజార్ అయ్యప్పస్వామి గుడి వద్ద మురుగుపారక అధ్వానంగా ఉన్న డ్రెయిన్

శానిటరీ అధికారుల నిర్లక్ష్యం

ప్రస్తుతం మునిసిపాలిటీలో శానిటరీ సెక్షన్‌లో 73 మంది పర్మినెంట్ వర్కర్లు, మరో 91 మంది కాంట్రాక్ట్ వర్కర్లు పనిచేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు శాతంలో పెద్ద గోల్‌మాల్ జరుగుతుందనేది ఎప్పటినుంచో ఉన్న ఆరోపణ. ఈ విషయంలో పురపాలకులు గానీ, అధికారులు గానీ నోరు మెదపని పరిస్థితి. పారిశుద్ధ్య నిర్వహణలో శానిటరీ అధికారుల నిర్లక్ష్యం పూర్తిగా కనిపిస్తుంది. ముఖ్యంగా శానిటరీ మేస్త్రీలు పనితీరు అధ్వానంగా ఉంది. తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విషయంలో ఇప్పటి వరకు ప్రజలకు సరైన రీతిలో అవగాహన కల్పించిన సందర్భం కూడా లేదు. పట్టణంలో ఏవార్డులో కూడా తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం లేదు . ఇక డంపింగ్‌యార్డ్ లేకపోవడంతో, చెత్తను ఇప్పటికీ గోదావరిగట్టునే పోస్తున్నారు.

యూత్ హాస్టల్స్ అధ్యక్షుడిగా పెద్దిబొట్ల

పాలకొల్లు సెంట్రల్: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పాలకొల్లు యూనిట్ కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు ఎదురుగా ఉన్న యూత్ హాస్టల్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, చైర్మన్‌గా కారుమూరి సూర్యనారాయణ, ట్రెజరర్‌గా ఎస్. సుబ్బారావు ఉపాధ్యక్షులుగా కేఏస్‌పీఎన్ వర్మ, డి.వెంకట్రావులతో పాటు మరో 11 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ హాస్టల్స్ జీవిత కాల సభ్యులు, సాధారణ సభ్యులు పాల్గొన్నారు.


యూత్ హాస్టల్స్ నూతన కార్యవర్గ సభ్యులు

యువతకు రాజమార్గం ఎన్‌సీసీ

భీమవరం: ఆర్మీ, పోలీస్ వంటి సాయుధ దళాల్లో చేరే యువతకు ఎన్‌సీసీ రాజమార్గమని డీఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) అన్నారు. డీఎన్నార్ కళాశాలలో ఆదివారం 76వ ఎన్‌సీసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీఎన్నార్ ఎన్‌సీసీ విభాగం యువతకు మార్గదర్శకత్వం వహిస్తూ ఎంతో మంది జీవితాలకు బంగారు బాటలు వేసిందన్నారు. ఎన్‌సీసీలో చేరిన ప్రతి క్యాడెట్ ఒక భాద్యతాయుత అధికారిగా ఎదగాలని ఆకాంక్షించారు. ముందుగా ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.మోజెస్, కె.రామకృష్ణంరాజు, కెప్టెన్ ఎ.వీరయ్య పాల్గొన్నారు.